క్లుప్తంగా

18 నుంచి మాండవ్య నారాయణుని కల్యాణోత్సవాలు



సామర్లకోటలోని మాండవ్యనారాయణ స్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక భీమవరం తుల్యభాగ నదీ తీరాన కొలువైన శ్రీ, భూ సమేత మాండవ్య నారాయణుని కల్యాణోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏటా ఉగాది తరువాత వచ్చే ఏకాదశి రోజున స్వామి వారి కల్యాణం జరుగుతుందని చెప్పారు. 18న గరుడ వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం, 19న మంగళస్నానాలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రాత్రి స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. 23న ధ్వజావరోహణ, పూర్ణాహుతి, 24వ తేదీ రాత్రి శ్రీపుష్పయోగోత్సవంతో కల్యాణ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

విద్యార్థులు ప్రతిభ కనబరచాలి



టోఫెల్ పరీక్షా విధానాన్ని పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

పెద్దాపురం: ప్రతి విద్యార్థీ తమలో దాగివున్న ప్రతిభను కనపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో స్థానిక రాజీవ్‌గాంధీ మున్సిపల్ పాఠశాలలో జరుగుతున్న టోఫెల్ పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు తమ తమ మేధస్సుకు పదునుపెట్టి పరీక్షా పోటీల్లో విజయం సాధించాలన్నారు. అనంతరం పరీక్షా విధానంపై ఆయన ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈఓ ప్రభాకరశర్మ, హెచ్‌ఎం బాపూజీ, సీఆర్పీ ప్రకాష్ తదితరులున్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్ర పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బుధవారం రెండవ రోజు వసంత నవరాత్ర పూజలు కొనసాగించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, మహాన్యాసం, కుమారా రామభీమేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, బాలా త్రిపుర సుందరి దేవికి నవావరణార్చన, నీరాజన మంత్రపుష్పాలు, కుంకుమార్చన, దర్బారు సేవ, వేదస్వస్తి నిర్వహించారు.

ఘనంగా బద్దిగడుగు ఉత్సవం



నూకాలమ్మ ఆలయం వద్ద బద్దిని తీసుకువస్తున్న ఆసాదులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ తల్లి బద్దిగడుగు ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, చైర్మన్ గవరసాని వీరాస్వామిల ఆధ్వర్యంలో ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఏటా ఉగాది రోజున అమ్మవారి ఆలయ తలుపులు మూసివేసి మరుసటి రోజున ఆలయ తలుపులు తెరచి బద్ది ఉత్సవాన్ని నిర్వహిస్తారు. బాజాభజంత్రీలతో ఏలేరు నదికి వెళ్లి బద్దిని కడిగి తీసుకువచ్చి అమ్మవారి ఆలయంలో ఉంచుతారు. గరగను పూజించి అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆలయ ఆసాదులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్పార్క్ సంస్థకు అభినందనలు

ఏలేశ్వరం: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు పట్టణానికి చెందిన స్పార్క్ సంస్థ ఎంపిక కావడంతో బుధవారం పలువురు అభినందనలు తెలిపారు. ఇస్రో స్పేస్‌ట్యూటర్ ప్రోగ్రాంకు రాష్ట్రంలో తొలిసారిగా స్పార్క్ సంస్థ ఎంపికైంది. ఈ సందర్భంగా పైల సుభాష్‌చంద్రబోస్ స్పార్క్ సంస్థ చైర్మన్ సాయిసందీప్, రీజినల్ కోఆర్డినేటర్ రవికిరణ్‌ను అభినందించి షీల్డ్ అందజేశారు. ఇస్రోకు స్పార్క్ సంస్థ ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రజారోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

- పట్టణ, గ్రామీణ వాసులకు ఉచిత వైద్యం
- ప్రజల ఆరోగ్యంపై పీహెచ్‌సీల భరోసా
- నాడు–నేడుతో వైద్యరంగంలో పెను మార్పులు

పెద్దాపురం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేపట్టిన నాటి నుంచి వైద్య రంగం కొత్త పుంతలు తొక్కింది. పట్టణంలో ఏరియా ఆసుపత్రి మినహా మరే ఆసుపత్రి నుంచి ప్రభుత్వ సేవలు అందిన దాఖలాల్లేవు. ప్రస్తుతం డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పేరుతో మరో రెండు పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నారు. సుమారు కోటి రూపాయలతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మిస్తున్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న పీహెచ్‌సీలకు సొంత భవనాల నిర్మాణం ఈ ప్రభుత్వ హయాంలోనే సాధ్యమైంది. అలాగే మండలంలోని పులిమేరు, కాండ్రకోట పీహెచ్‌సీలతో పాటు మిగిలిన గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వైద్య సేవలందించే దిశగా చర్యలు చేపట్టింది. ఒక్కో విలేజ్ క్లినిక్ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులతో ఈ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టి వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకున్నారు.

ఆదరణ అమోఘం

ఈ ఆసుపత్రుల్లో ప్రాథమికంగా షుగర్, బీపీ, వాంతులు, విరేచనాలు తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఇక్కడ 64 రకాల వైద్య సేవలతో పాటు 172 రకాల మందులు లభిస్తాయి. ఒక్కో ఆసుపత్రికి రోజుకు 30 నుంచి 50 మంది వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారంటే వాటికి ఎంత ఆదరణ ఉందో అర్థం చేసుకోవచ్చు. స్థానిక ఏరియా ఆసుపత్రికి పెద్దాపురం పరిసర ప్రాంతాల నుంచి రోజుకు 100 నుంచి 120 మంది వరకు ఓపీ వస్తున్నాయి.



నాడు–నేడులో అభివృద్ధి చేసిన పులిమేరు పీహెచ్‌సీ నాటి పరిస్థితి ఇదీ..



అధునాతన సౌకర్యాలతో వైద్యసేవలు అందిస్తున్న ఆసుపత్రి భవనం

పెద్దాపురం పట్టణంలో ఏరియా ఆసుపత్రి, పులిమేరు, కాండ్రకోట పీహెచ్‌సీలు మినహా మరే వైద్య సేవలు లేవు. మందుల కొరత వేధించేది. వైద్య పరీక్షలు అంతతమాత్రమే. ఇక ఆసుపత్రుల సౌకర్యాలు అంతంత మాత్రమే...

నేటి అభివృద్ధి ఇదీ...

ఏరియా ఆసుపత్రి వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు మరో రెండు పీహెచ్‌సీల ద్వారా ప్రజల వద్దకే వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. 104 ద్వారా ప్రతి వార్డులో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో రెండు పీహెచ్‌సీలను నాడు–నేడు పథకం ద్వారా అధునాతన పరికరాలతో అన్ని వైద్య పరీక్షలతో సేవలందిస్తున్నారు. ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్ నిర్మాణాన్ని చేపట్టి గ్రామీణులకు చేరువలో వైద్య సేవలందిస్తున్నారు.

పెద్దాపురం అర్బన్, రూరల్‌లో పీహెచ్‌సీలు

1. ఏరియా ఆసుపత్రి, రాజమహేంద్రవరం రోడ్డు
2. అర్బన్ హెల్త్ సెంటర్, పాత ఆసుపత్రి వీధి
3. డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం, శోభా థియేటర్ వీధి
4. డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం, సినిమా సెంటర్
5. డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పులిమేరు
6. డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాండ్రకోట
7. గ్రామీణ ప్రాంతాల్లో మరో 20 విలేజ్ క్లినిక్‌లు

అందుబాటులో వైద్యం



ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. చిన్నపాటి జ్వరమొస్తే ప్రైవేట్ ఆసుపత్రిలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసేవారం. ఇప్పుడు అలా కాకుండా 64 రకాల వైద్య సేవలను ఉచితంగా అందించడం మాములు విషయం కాదు.

– తాడి కస్తూరి, వీర్రాజుపేట, పెద్దాపురం

ప్రజలకు చేరువలోనే వైద్య సేవలు



సామాన్య ప్రజలందరికీ ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఫ్యామిలీ డాక్టర్‌గా ప్రతి ఇంటికీ వెళ్లి వైద్యం అందించే దిశగా అన్ని సేవలు అందిస్తున్నాం. మాములు సమయాల్లోనూ ఓపీ బాగా పెరిగింది. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి 24 గంటల వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ సూర్యకుమారి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పెద్దాపురం

టోఫెల్ ఏర్పాట్ల పరిశీలన



స్మార్ట్ టీవీల ద్వారా పరీక్షల తీరును పరిశీలించిన సీఎంఓ నాగేశ్వరరావు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలను సీఎంఓ చామంతి నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రైమరీ పాఠశాలల్లో టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌బీ, స్మార్ట్ టీవీల ద్వారా ఏ విధంగా నిర్వహిస్తున్నారో పరిశీలించారు. అదే విధంగా ఎలిమెంటరీ పాఠశాలల వాతావరణాన్ని పరిశీలించారు. పాఠశాలలోని ఆర్ ప్లాంటులను, విద్యార్థుల వర్కు బుక్‌లను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ప్రతి గంటకు ఒకసారి విద్యార్థులు తాగునీరు తాగాలని ఆయన సూచించారు. అదే విధంగా మండల పరిధిలోని అచ్చంపేట ఎలిమెంటరీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి–2 పి పుల్లయ్య పరిశీలించారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



శ్రీరాంపురంలో బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: వేసవిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య సూచించారు. మండలంలోని శ్రీరాంపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బుధవారం తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో నీరు ఎక్కువగా తాగాలన్నారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. పండ్ల రసాలు, ద్రవ పదార్థాలు తీసువాలని సూచించారు. కాటన్ దుస్తులను ధరించాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నేటితో ముగియనున్న రంజాన్

సామర్లకోట: నెల రోజుల పాటు ఉపవాస దీక్షతో, ప్రార్థనలతో సాగిన రంజాన్ వేడుకలు గురువారంతో ముగియనున్నాయి. ఈ మేరకు గురువారం ఉదయం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ముస్లిం సంఘ నాయకులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే ఈద్ ముబారక్‌లో ముస్లింలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

వలంటీర్లపై ప్రతిపక్షాల కపట ప్రేమ

- గతంలో కక్ష సాధించి ఇప్పుడు కనికరం చూపుతారా ?
- ప్రతిపక్షాలపై మండిపడిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పిఠాపురంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి ఎన్నికల ప్రచారం

పిఠాపురం: ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే గ్రామ వలంటీర్లను ఒకప్పుడు గోనె సంచులు మోసేవారు, తీవ్రవాదులు అని నానా మాటలు ఆడి కక్ష సాధించిన ప్రతిపక్షాలు ఇప్పుడు స్వరం మార్చి వలంటీర్లపై కపట ప్రేమ చూపుతున్నాయని వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత అన్నారు. పిఠాపురం 2, 3 వార్డుల్లో బుధవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ వలంటీర్ల సేవలను దూరం చేసిన ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పడంతో పాటు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సేవా దృక్పథంతో ప్రతి నిత్యం పేదల పక్షాన నిలిచి వారికి ప్రభుత్వ పథకాలను అందించే వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలు కుట్రపన్ని వారిని పేదలకు దూరం చేశాయన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వలంటీర్లు ప్రజలకు సేవలందించారన్నారు. అలాంటి వ్యవస్థను కించపరుస్తూ మాట్లాడిన ప్రతిపక్షాలు ఇప్పుడు వలంటీర్ల గౌరవ వేతనం పెంచుతాం, వలంటీర్లను కొనసాగిస్తామని చెప్పడం గాయం చేసి మందు రాసినట్టుగా ఉందన్నారు. ఆయా వార్డుల్లో ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు సాదర స్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో మమేకమయ్యారు. మాకు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా చెప్పుకునే అవకాశం మీ వద్దే మాకు ఉందని, అందుకే మీరే మాకు ఎమ్మెల్యే కావాలని, వైఎస్ జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ స్థానికులు ముక్త కంఠంతో చెప్పారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లిన ఆమె ఇప్పటివరకూ తాను పిఠాపురం పట్టణంలో చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, కౌన్సిలర్లు మతం లోవరాజు, లలిత, కో ఆప్షన్ మెంబర్ గండేపల్లి బాబీ, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు



ఎన్నికల ప్రచారంలో భాగంగా కుండలు తయారు చేస్తున్న వంగా గీత

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు పరిశీలకుడు షేక్ బాబ్జాన్
- గొల్లప్రోలులో పార్టీ కార్యాలయం ప్రారంభం

పిఠాపురం: వచ్చే ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ అదనపు పరిశీలకుడు షేక్ బాబ్జాన్ అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో బుధవారం ఆయన వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా వాటిని ప్రజలు తిప్పికొడతారన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారన్నారు. ఓటమి తథ్యమని తెలిసి ప్రతి పక్షాలు లేనిపోని ఆరోపణలకు చేస్తున్నాయన్నారు. నియోజకవర్గ ప్రజలకు సుపరిచితురాలు, పిలిచిన వెంటనే పలికే వ్యక్తి, ఇంట్లో మనిషిలా అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం ఉన్న వంగా గీతను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వంగా గీత మాట్లాడుతూ పార్టీ ముఖ్య నాయకులతో గొల్లప్రోలులో ఎన్నికల ప్రచారానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గొల్లప్రోలు ప్రజానీకం పట్ల తనకు అపార నమ్మకం ఉందని, తప్పకుండా తనకు ఎమ్మెల్యేగా గెలిపిస్తారన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీని ఒక మోడల్ నగర పంచాయతీగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు, పార్టీ పట్టణాధ్యక్షుడు మైనం రాజా, పార్టీ నాయకులు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగలి బాబ్జి, మొగలి అయ్యారావు, జ్యోతుల భీముడు, అనిశెట్టి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో పార్టీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న వంగా గీత

జగన్ పాలనపైనే ప్రజల నమ్మకం

- వలంటీరు వ్యవస్థతో పేదలకు మేలు
- పీబీ దేవంలో దవులూరి ప్రచారం
- తోడుగా పాల్గొన్న భార్య, కుమార్తె

సామర్లకోట: ప్రజలల్లో జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై నమ్మకం పెరిగిందని దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం భార్య చంద్రకళ, రెండో కుమార్తె సార్వికతో కలసి పీబీ దేవంలో సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు మలకల సూరిబాబు, డాక్టరు వైవీబీ ప్రసాదరావు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబులతో కలిసి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న గణపతి ఆలయంలో పూజలు చేసి అనంతరం సందవోలు వీరవెంకట సత్యనారాయణమూర్తిని కలిసి జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. 40 ఏళ్ల తరువాత స్థానికునిగా వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం లభించడంతో పార్టీలకు అతీతంగా తనకు మద్దతు ఇవ్వాలన్నారు. 2014 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయక పోవడమే కారణమన్నారు. కానీ సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి అన్నింటినీ అమలు చేశారన్నారు. ఆయన భార్య చంద్రకళ మాట్లాడుతూ 22 ఏళ్లుగా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ప్రయత్నిస్తూ ఉండగా సీఎం జగన్ టిక్కెట్టు ఇచ్చారని, తన భర్తను గెలిపించుకోవడానికి ఇంటింట ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అమలు చేసిన పథకాలను వివరించే అవకాశం తనకు లభించిందన్నారు. భారతమాత సేవా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు గౌరకపూడి చిన్నయ్యదొర, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా తదితర నాయకులు పాల్గొన్నారు.

28, 30 వార్డుల్లో దొరబాబు ప్రచారం

పట్టణ పరిధిలోని 28, 30 వార్డుల్లో బుధవారం ఆ వార్డు కౌన్సిలర్లు రెడ్నం సునీత, చల్లపల్లి వెంకట సత్య నారాయణల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక అభ్యర్థికి ఒక సారి అవకాశం ఇవ్వాలని దొరబాబు ఇంటింట ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు జట్ల మోహన్, చిట్టుమాని రాఘవ, రెడ్డి లోవకుమారి, నమ్మి సూర్యదుర్గ, సేపెని సురేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట 28వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న దొరబాబు



పీబీ దేవంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దొరబాబు, భార్య చంద్రకళ, కుమార్తె సార్వికా

కోడ్ అమలుకు సహకరించాలి

- వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉంచాలి
- ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) అమలుకు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది సహకరించాలని ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఆయా రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు ఎన్నికల నియమావళిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రక్రియలో వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని రామారావు కోరారు. ఓటర్ల జాబితాలో వచ్చిన క్లెయిముల పరిష్కారంపై మరింత అవగాహన అవసరమన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఇప్పటికి ఫారం–6కు సంబంధించి 457, ఫారం–7కు సంబంధించి 52, ఫారం–8కు 98 దరఖాస్తులు అందాయన్నారు. ఆయా క్లెయిముల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆర్డీఓ అన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ఈవీఎం ట్యాంపరింగ్ అనే అపోహలను ప్రజలు విడనాడి, ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలోకి గ్రామ వలంటీర్లను తీసుకువచ్చే ప్రసక్తే లేదని, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద ప్రభుత్వ ఉద్యోగులు గాని, వలంటీర్లుగాని ఉంటే ఈసీ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఆయన హెచ్చరించారు. అనంతరం ఓటర్ల జాబితా విధానం, ఎన్నికల ప్రక్రియ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో గోపు మురళి (వైఎస్సార్ సీపీ) కనపర్తి చీమదొర (వైఎస్సార్ సీపీ) రంధి సత్యనారాయణ (టీడీపీ) నీలపాల సూరిబాబు (సీపీఎం)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.



వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జేఎస్ రామారావు

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం



మూలపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

కొత్తపల్లి: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని మూలపేటలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఉప్పాడ తీరప్రాంతంలో నిర్మిస్తున్న మేజర్ హార్బర్‌తో ఈ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారతాయన్నారు. తమ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కంబాల మౌనిక, ఎంపీటీసీలు అడ్డా పాప, గోగు లోవకుమారి, పార్టీ నాయకులు కంబాల లక్ష్మణ రావు, అడ్డా త్రిమూర్తులు, గోగు జగన్నాథం, పార్టీ మండలాధ్యక్షుడు అనాల సుదర్శన్, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు తదితరులు పాల్గొన్నారు.